క్లుప్తంగా

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నేడు

రాజంపేట టౌన్ : పట్టణంలోని నూనెవారిపల్లెలో ఉన్న శ్రీ సాయి విద్యాలయ హైస్కూల్‌లో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు శ్రీవారి భక్తసేవా సమితి ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ వారి సౌజన్యంతో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే స్వామి వారి వ్రతంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

4న జగనన్న సురక్ష కార్యక్రమం

పెనగలూరు : ఈనెల 4వ తేదీ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఈటమాపురం సచివాలయం, కట్టావారిపల్లి సచివాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీధర్ రావు తెలిపారు. అలాగే 6న నల్లపరెడ్డిపల్లి, అనంతంపల్లి, 11న కోమంతరాజుపురం, ఓబిలి, 13న సింగారెడ్డిపల్లి, సిద్దవరం, 18వ తేదీన పెనగలూరు-1, కొండూరు-1, 20వ తేదిన పెనగలూరు-2 సచివాలయం, కొండూరు-2 సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు.

5 నుంచి శీతల గంగమ్మ జాతర

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పార్వతీపురంలో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారి 20వ జాతర మహోత్సవ కార్యక్రమం జూలై 5వ తేదీ నుంచి జరుగునని దేవస్థానం కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ శీతల గంగమ్మ అమ్మవారి జాతర సందర్భంగా జూలై 5వ తేదీన అమ్మవారికి పాలాభిషేకం, అలంకరణ, పొంగళ్లు, శక్తి పూజ, తీర్థప్రసాదాల వితరణ చేస్తామన్నారు. రాత్రి అమ్మవారి కథ, అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా గుడికి చేరుతుందన్నారు. జూలై 6వ తేదీన అమ్మవారికి ప్రత్యేక పూజలు సాయంత్రం అమ్మవారి ఊరేగింపు అనంతరం అమ్మవారి ప్రతిమను నిమజ్జనం ఉంటుందన్నారు. జాతరను విజయవంతం చేయాలని కోరారు.

బోనాల సమర్పణ



బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

గాలివీడు : మండలంలోని నూలివీడు పంచాయతీ నాగూరివాండ్లపల్లెకు సమీపంలో వెలసిన రేణుక ఎల్లమ్మకు గ్రామస్తులు ఆదివారం ఘనంగా బోనాలను సమర్పించారు. ఖరీఫ్ సీజన్ మొదలై నెల పూర్తయినప్పటికీ వర్షాలు రాకపోవడంతో నాగూరువాండ్లపల్లె ప్రజలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కుబడులను చెల్లించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సంవృద్ధిగా పండాలని రైతాంగం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

విశ్రాంత ఎంఈఓ రామిరెడ్డి మృతి

సంబేపల్లె : మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఎంఈఓ రామిరెడ్డి (80) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. తెలుగు పండిట్‌గా, 2003 సంవత్సరంలో సంబేపల్లె విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తెలుగు బోధిస్తున్నారు. రామిరెడ్డి మృతికి విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు ఆయన చేసిన సేవలను స్మరించుకొని, నివాళులర్పించారు. రామిరెడ్డి అంత్యక్రియలు సోమవారం సంబేపల్లెలో నిర్వహించనున్నారు.

ఆలయానికి ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లను ఆలయానికి అందజేస్తున్న దాత

సంబేపల్లె : నల్లగంగమ్మ ఆలయానికి 11 సీలింగ్ ఫ్యాన్లను కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన దాత హరిబాబు వితరణ చేశారు. అనంతరం హరిబాబుచే అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

మల్లాలమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకారంలో మల్లాలమ్మ

పుల్లంపేట : మండల పరిధిలోని ఆర్.గొల్లపల్లి గ్రామంలో ఆదివారం మల్లాలమ్మకు మహిళలు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు విరివిగా కురవాలని, పాడిపంటలు సంవృద్ధిగా పండాలని మొక్కుకున్నారు.

శిల్పారామంలో ఆట-పాట

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక విజిల్స్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు.

వైఎస్సార్ పింఛన్.. భరోసానిచ్చెన్

- గతం ప్రభుత్వంలో పడిగాపులు.. ప్రస్తుతం ఇంటి వద్దకే
- అర్హులందరికీ ప్రతి నెల 1వతేదీనే పింఛన్ అందజేత



ఇంటివద్ద పింఛన్ అందిస్తున్న వలంటీర్ నారాయణ

చిట్వేలి : డబ్బుకే ప్రాధాన్యం ఇస్తున్న నేటి సమాజంలో ప్రభుత్వం అందిస్తున్న ఫించన్లతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఆర్థిక భరోసా లభించడంతోపాటు ఆయా కుటుంబాలలో గౌరవ మర్యాదలు దక్కుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ. 1000లు ఉన్న పింఛన్ మొత్తం జగనన్న పుణ్యమా అని రూ. 2 వేలకు చేరడంతోపాటు జగనన్న సీఎం కావడంతో ఆయన దయ వలన మూడు వేలకు పెంచుతూ పోతుండటంతో ఫించన్‌దారులు హర్షిస్తున్నారు.

కాగా మండలంలో 16 రకాల పింఛన్లు మొత్తం 5712 మందికి అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ దారులు మరణిస్తేనే కొత్త పింఛన్లు మంజూరయ్యేవి, జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నారు. పైగా తెల్లవారక మునుపే పింఛన్ కోసం వేచి చూడాల్సిందే. ఎంత పడిగాపులు కాచిన పింఛన్ అందడం కష్టతరమయ్యేది. ప్రస్తుతం వలంటీర్లు పింఛన్లను ఇంటికి తీసుకెళ్ళి ఇస్తుండటం పింఛన్‌దారులకు ఎంతో సంతోషంగా ఉంది.

అవసరాలు తీరుతున్నాయి



ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌తో నా అవసరాలు తీరుతున్నాయి. కుటుంబం మీద ఆధారపడకుండా జీవనం సాగిస్తుండటంతో కుటుంబంలో గౌరవ మర్యాదలు పెరిగాయి. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3000కు పెంచుకుంటూ పోతున్నారు. ఆర్థిక భరోసా ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– షేక్ టెంకాయల ఖాసిం, సింగనమల వీధి

గౌరవంగా జీవిస్తున్నాం



ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక భరోసాతో కుటుంబానికి భారం కాకుండా స్వతంత్రంగా జీవిస్తున్నాం. ఒకరిపై ఆధారపడే అవసరం లేకుండా ఆర్థికంగా గౌరవంగా జీవిస్తున్నా. గత ప్రభుత్వంలో పింఛన్ కోసం వేచి చూసేవాళ్లం. ప్రస్తుతం వలంటీర్ల ద్వారా ఇంటికే అందిస్తుండటంతో శ్రమ లేకుండా పోయింది.

– ఈ.వెంకట సుబ్బయ్య, చింతలచెలిక అరుంధతివాడ

పింఛన్‌తోనే జీవనం



మగ దిక్కులేక కూలీ పని చేసే స్థితి లేకపోయినా ప్రభుత్వం వితంతు పింఛన్‌తో జీవనం సాగిస్తున్నాను. పింఛన్ రాక పోయి ఉంటే నా పరిస్థితి అగమ్యగోచరం. అదికాకుండా ప్రతి నెల 1వ తేదీనే పింఛన్ అందిస్తున్నారు. ఎక్కడ ఉన్నా వలంటీర్ తెలుసుకొని వచ్చి పింఛన్ అందిస్తుండటం చాలా సంతోషాన్ని ఇస్తోంది.

– మల్లెల చిన్నక్క, బీసీ కాలనీ, రాజుకుంట

పూర్వ విద్యార్థుల సహకారం మరువలేనిది



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె : పాఠశాలకు పూర్వపు విద్యార్థులు అందించిన సహకారం మరువలేనిదని ప్రధానోపాధ్యాయులు రమణయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 1986-87 బ్యాచ్ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, గంగిరెడ్డి, వెంకటయ్య, సుబ్రమణ్యంలను ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సంవత్సరాలు మా వద్ద చదువుకున్న విద్యార్థులు సంవత్సరాల తరువత ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. అప్పటి విద్యార్థులు ప్రతి ఒక్కరు పరిచయం చేసుకుంటూ గత స్మృతులను నెమరవేసుకొన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు రమణయ్య మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొని వెళ్లిపోతారని అయితే 1986-87 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారన్నారు. మహబుబ్‌బాషా అనే పూర్వ విద్యార్థి తన తండ్రి దివంగత ప్రధానోపాధ్యాయుడు బడే సాహెబ్ జ్ఞాపకార్థం రూ.18 వేలు విలువ చేసే మైక్ సెట్, ముక్కావారిపల్లెకు చెందిన లక్ష్మీకర్‌రెడ్డి రూ.40వేలు విలువ చేసే వాటర్‌కూలర్, రూ.25 వేలు విలువ చేసే సైన్స్ ల్యాబ్ పరికరాలను చిన్నఓరంపాడుకు చెందిన వెంకటసుబ్బయ్య నాయుడు అందజేశారన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు ప్రయోజనకరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న యదుభూషన్‌రెడ్డి

గాలివీడు : గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడంతో పేదలకు ప్రయోజనకరంగా ఉంటాయని వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గాలివీడులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కడపకు చెందిన లైఫ్‌లైన్ ఆసుపత్రి, గాలివీడు అమీర్ మందులషాపు, ల్యాబ్‌ల సహకారంతో ఉచిత వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఎస్ఐ వెంకట శివ కుమార్ మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి వెంకటశివారెడ్డి, నిజాముద్దీన్(ఎస్‌కే) స్థానిక నాయకులు గోపిరెడ్డి, సుబ్బారెడ్డి, లైఫ్‌లైన్ ఆసుపత్రి వైద్యులు, అమీన్ మెడికల్ స్టోర్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి ముస్తాబైన ఆలయం



ముస్తాబైన సాయిబాబా ఆలయం

పెనగలూరు : గురు పౌర్ణమికి పెనగలూరులోని రంగమ్మ చెరువుకట్టపై ఉన్న సాయిబాబా ఆలయం ముస్తాబైంది. నిర్వాహకుడు పసుపులేటి రాజ మాట్లాడుతూ గురుపౌర్ణమికి ఆలయంలో అన్ని రకాలుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ గురుపౌర్ణమికి వేకువజాము నుంచి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కలిమెల పుల్లయ్య జ్ఞాపకార్థం కుమారుడు కలిమెల ఆదినారాయణ, వెంకటరత్నమ్మ దంపతులు అన్నదానం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎగువ సిద్దవరంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు సిద్దవరం వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరీలు తెలిపారు.

సత్కారం

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఎస్‌బీవీడీ సభా ఉన్నత పాఠశాలలో ఆదివారం పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవాసంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మడగలం శ్రీనివాసులను సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బనరసారెడ్డి మాట్లాడుతూ పుల్లంపేట వాసికి స్టేట్ లెవల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. మీ పరిధిలోకి వచ్చిన విషయాలను వెంటనే పరిష్కరించి మండలానికి, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని కోరారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి

గుర్రంకొండ: ఉర్దూ భాషాభివృద్ధికి గ్రంథాలయా సిబ్బంది కృషి చేయాలని రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. ఆదివారం స్థానిక ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మెన్ కరీముల్లాతో కలసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉర్దూ అకాడమీ 36 కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను, మరో 36 గ్రంథాలయాలను నిర్వహిస్తోందన్నారు. ఉర్దూ సాహిత్యం, భాషాభివృద్ధికి ఉర్దూ అకాడమి సేవలందిస్తోందన్నారు. ఇటీవల రాష్ట్ర స్కిల్ డెవల్మెపమెంట్ కార్పోరేషన్ తో ఎంఓయూ చేసుకొని వృత్తి నైపుణ్యాలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఉర్దూ అకాడమి ద్వారా ఉర్దూ పత్రికలను తీసకొచ్చి ఉర్దూ పాఠశాలలకు, గ్రంథాలయాలకు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కుసుమకుమారి, సిబ్బంది చంద్రశేఖర్‌నాయుడు, షౌకత్‌హుస్సేన్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సంబేపల్లె: దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తుల



చిన్నమండెం: దర్శనమిస్తున్న మల్లూరమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యా నదిపై కొలువైన మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మను ఆదివారం వేలాది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు ఉన్న వారు బోనాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ రవీందర్ రాజులు అమ్మవారి దర్శనాన్ని కల్పింపజేశారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

దివ్యాంగులకు పింఛన్‌ను పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న బాబ్‌జాన్

రాయచోటి అర్బన్ : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్)రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.చిన్నసుబ్బయ్య యాదవ్, ఎస్.బి. సుబ్బారావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వీహెచ్‌పియస్ జిల్లా కమిటీ ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా గన్నామంతి బాలాజీకుమార్, ప్రధానకార్యదర్శిగా వి.ప్రసాద్, కార్యదర్శిగా ఎస్.బాబ్‌జాన్, ఉపాధ్యక్షుడు గగ్గటూరి మస్తాన్‌వలి, అధికార ప్రతినిధి జి.సాయిక్రిష్ణ, మహిళా అధ్యక్షురాలిగా ఒట్టి నాగమల్లమ్మలు ఎంపికయ్యారు.

సన్నాహక సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎస్.నరేంద్రబాబు

రాయచోటి అర్బన్ : ఈనెల 12న ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందాక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో రాయచోటిలో నిర్వహింప తలపెట్టిన ఉమ్మడి కడప జిల్లా ఎమ్మార్పీస్, ఎంఎస్‌పీల సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నేతలు ఎస్.నరేంద్రబాబు, వెలగచర్ల శివయ్య మాదిగలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రీతమ్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బి.మనోహర్ మాదిగ అధ్యక్షతన సన్నాహక సదస్సు ఏర్పాట్లపై సమీక్షా చేశారు. సమావేశంలో ఎమ్మార్పీస్ జాతీయ నేత వంగిమళ్ళ రమణ, ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లా కన్వీనర్లు మానికొండ వెంకటేష్, దుద్దు రామక్రిష్ణ, ఎంఈఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు హరిబాబు, గూటం అన్నయ్య, ప్రేమ కుమార్, నియోజకవర్గ నేతలు సుధాకర్, దుమ్ము చిన్నా, ఆనంద్, ఆంజనేయులు, సి.వి.రమణ తోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక

గాలివీడు : వర్గీకరణ సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న కమిటీల నిర్మాణంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కో కన్వీనర్ రామాంజనేయులు ఆదేశాలతో అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ అశోక్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండల కన్వీనర్‌గా రమణ, కో-కన్వీనర్‌గా రఘురామను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, సీఎమ్ సురేష్, మాజీ సర్పంచ్ జయరాం, జగనాథ, ఆంజనేయులు, రమేష్, వెంకటేష్, వెంకటరమణ, నాగార్జున, లోకేష్, ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫాం పాండ్స్‌కు జలకళ



నీటితో కళకళలాడుతున్న ఫాం పాండ్

గాలివీడు : మండలంలోని గుండ్లచెరువులో వాటర్‌షెడ్ల కింద రైతుల పొలాల వద్ద ఫారం పాండ్స్ నీటితో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే చాలా మంది రైతుల భూములలో చిన్నచిన్న తోటలు ఉండటంతో నీటిని నిల్వ చేయగా వ్యవసాయ పంటలు, తోటలకు నీటి తడులకు ఉపయోగపడుతున్నాయి. ఇప్పటికే రైతులకు ఆయిల్ ఇంజన్లు, పైపులు, తార్పలిన్ పట్టలు వంటి అందించారు. పార్టీలకతీతంగా అవసరమైన రైతులకు మంజూరు చేస్తూ వాటర్‌షెడ్లను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి గ్రామస్తులు, రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతులకు సాగు సాయం అందించండి



మాట్లాడుతున్న కాటమయ్య

రాయచోటి అర్బన్ : రైతులకు పంట సాగు కోసం ఒక ఎకరాకు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన జిల్లా స్థాయి రైతు సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ గత పాలకులు అనుసరించిన విధానాల కారణంగా రాష్ట్రంలో ప్రతిరైతు రూ.2.45లక్షల మేర రుణభారంతో తల్లడిల్లుతున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పాలకులు మద్దతు ధర ప్రకటించకపోవడంతో ఈ పరిస్థితి చోటుచేసుకుంటుందన్నారు. ఎరువులు, పురుగుల మందులను 99శాతం సబ్సిడీతో అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, నేతలు సాంబశివ, పరదేశిరెడ్డి, రాజారెడ్డి, శంకరరెడ్డి, రామచంద్ర, సుదీర్‌కుమార్, విశ్వనాథనాయక్, రైతులు పాల్గొన్నారు.

ధరలు తగ్గేదాకా సబ్సిడీ టమాట



టమాటలను అందిస్తున్న వండాడి వెంకటేశ్వర్లు

రాయచోటి టౌన్ : టమాటల ధరలు అదుపులోకి వచ్చే వరకు సబ్సిడీతో ప్రజలకు అందిస్తామని రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం రైతు బజార్‌లో నాణ్యమైన టమాటలను సబ్సిడీతో (కిలో రూ.50లకు) అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలు ఇబ్బంది పడకూడదనే భావనతో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన టమాటలను అందించాలని సూచించారన్నారు. ఆయన సూచనలకు మేరకు టమాటల ధరలు అదుపులోకి వచ్చే వరకు రైతు బజారులో ప్రతి రోజూ ఉదయం 6:30గంటల నుంచి ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొచ్చిన వారికి కిలో రూ.50లకు అందివ్వనున్నట్లు చెప్పారు.

ప్రమాదాల నివారణకు పూజలు

గుర్రంకొండ: రాయచొటి- అంగళ్లు ఎన్‌హెచ్ 340 మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మండలంలోని దద్దాలవారిపల్లె గ్రామస్తులు హైవే రోడ్డుపై ప్రత్యేక శాంతి పూజలు నిర్వహించారు. జాతీయ రహదారిపై గుర్రంకోండ నుంచి చెర్లోపల్లె మీదుగా మొటుకు క్రాస్ వరకు ఇటీవల నెలరోజులుగా 12 రోడ్డు ప్రమాదాలు జరిగి ఎనిమిది మంది మృతి చెందారు. ఈనేపథ్యంలో రహదారికి శాంతి పూజలు నిర్వహించాలని భావించి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పీలేరు రూరల్ : అరుణాచలం (తిరువణ్ణామలై) గిరి ప్రదక్షిణకు 8 ప్రత్యేక బస్సు సర్వీసులు వెళ్లినట్లు డీఎం కుమార్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం బస్సులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నుంచి 4, కేవీపల్లె నుంచి 2, సదుం నుంచి 2 సర్వీసులు పంపినట్లు తెలిపారు. ప్రతి పౌర్ణమికి పీలేరు నుంచి తిరువణ్ణామలైకు స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమైందని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్టీఐ బాబునాయక్, మార్కెటింగ్ టీమ్ కె.వి. రమణ, ప్రమీల, ఎన్ఎంయూ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు నిండుగా.. రైతన్నకు అండగా

- రైతాంగానికి మేలు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు
- ఆర్బీకేలలో రైతులకు అందుబాటులో ఎరువులు



ఆర్‌బీకేల వద్ద ఎరువులను దించుతున్న దృశ్యం

రైల్వేకోడూరు : వ్యవసాయం అంటే దండగ కాదు పండగ అని నిరూపిస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనే నానుడిని ప్రభుత్వం నిజం చేసి చూపిస్తోంది. వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ రైతుల అవసరాలకు తగ్గట్టు ఎప్పటికప్పుడు వారికి కావాల్సిన చర్యలను తీసుకుంటోంది. వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడే ఎరువులను ప్రభుత్వం కొరత లేకుండా చూసేందుకు చర్యలు తీసుకుంది. రైతు భరోసా కేంద్రాలలో ఎరువులను అందుబాటులో ఉంచింది. దీంతో రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఎంటో అర్థమవుతుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులు భూమిని దున్నడం నుంచి చివరికి మంచి ధరలకు పంటలను కొనుగోలు చేయడం వరకు అన్ని వ్యవసాయ కార్యకలాపాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఉంచింది.

రైతులు నష్టపోకూడదనే..

రైతులకు నష్టం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎరువులను సిద్ధం చేసింది. ఇప్పటి వరకూ రైల్వేకోడూరు మండల పరిధిలో 400 మెట్రిక్ టన్నుల వినియోగించినట్టు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. ఇందులో భాగంగానే యూరియా, డీఏపీ, పొటాషియం, కాంప్లెక్స్ వంటి ఎరువులను ఆర్బీకేలకు తరలించింది.

గ్రామంలోనే ఎరువులు అందిస్తోంది



మా గ్రామంలోనే మాకు అవసరమైన ఎరువులను ఆర్‌బీకేలలో ప్రభుత్వం అందించడం సంతోషించదగ్గ విషయం. ఇకపై ఎరువుల కోసం చాలా దూరం ప్రయాణించాల్సిన అవసరంలేదు. వేచి చూడాల్సిన అవసరం అసలే లేదు. మాలాంటి రైతులకు ఇలాంటి సేవలు ప్రభుత్వం అందిస్తుంటే ఇంతకన్న మాకు ఏమి కావాలి.

– లక్కిరెడ్డి రాజమోహన్‌రెడ్డి, రైతు, ఓ.కొత్తపల్లి, రైల్వేకోడూరు

రైతుకు మేలు చేసే నిర్ణయాలు



రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుంది. గత ప్రభుత్వాలకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు మేలు చేసేలా మెరుగైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. మూడు నెలల ముందుగానే ఎరువులు సరఫరా చేయడం రైతులపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుంది.

– ఏ.చెంగల్‌రెడ్డి, రైతు, ఎస్.ఉప్పరపల్లి, రైల్వేకోడూరు

ఆర్బీకేల్లో ఎరువుల సరఫరా హర్షణీయం



రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులను రైతు భరోసా కేంద్రాలలో ప్రభుత్వం సరఫరా చేయడం హర్షణీయం. దీని వలన ఎరువుల కొరత ఉత్పన్నం కాదు. భారతదేశంలోనే రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎరువులను సరఫరా చేస్తున్న ఏకైక సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ నిలిచిపోతారు.

– వంకర చెంచయ్య, రైతు, కె.బుడుగుంటపల్లి, రైల్వేకోడూరు